ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 24 సంచిక : 1 సెప్టెంబర్ 2018

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 12/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

12-01-1986
జిన్నూరు

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-01-1986, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

రామకృష్ణపరమహంస, రమణమహర్షి, వివేకానందుడు, వీళ్ళంతా కూడా డాక్టర్లు. స్పిరిట్యువల్ డాక్టర్స్. మన డాక్టర్లు శరీరానికి ఏదైనా అనారోగ్యం వస్తే వైద్యం చేస్తారు. వీళ్ళు మన మనస్సులో ఉన్న దోషాలు ఏంటో గ్రహించి, ఆ దోషాలని తీసేస్తారు. మన మనస్సులో ఏ దోషాలు ఉన్నాయో మనకంటే వాళ్ళకి బాగా తెలుసు. ఆ దోషాలని తీసేస్తేనే కానీ మన స్వరూపం మనకి తెలియదు. ఆ దోషాలని తీసేస్తే జ్ఞానం కలుగుతుంది కాబట్టి సుఖాన్ని పొందుతాము.

కృష్ణుడు రామకృష్ణపరమహంసగా అర్జునుడు నరేంద్రుడుగా జన్మించారని రామకృష్ణమఠం వాళ్ళ సాంప్రదాయం. వాళ్ళు నరనారాయణులు అని, నారాయణుడు రామకృష్ణుడిగా వస్తే నరుడు నరేంద్రుడిగా, అంటే వివేకానందుడిగా వచ్చాడని రామకృష్ణ మిషను వాళ్ళ విశ్వాసం. వాళ్ళ సాంప్రదాయంలో వివేకానందని స్వామీజీ అని పిలుస్తారు. వాళ్ళు జంట అన్నమాట. మానవజాతి యొక్క పరిణామంలో వాళ్ళని ముందుకి తీసుకొనివెళ్ళటంకోసం కృష్ణార్జునులే ఇలా అవతరించారు అని రామకృష్ణుడే స్వయంగా చెప్పిన మాటలు. వివేకానందుడు జన్మించక ముందు, ఆయన సప్తఋషులలో ఒకడని చెప్పారు. రామకృష్ణుడు ఈ భూమి మీదకి రాకముందే ఒక దివ్యమైన శక్తి, ఒక యూనివర్సల్ శక్తి, ఒక దివ్యమైన వెలుగు ఒక బాలుడి ఆకృతి ధరించింది. అది కాళీశక్తి అనండి, పరమేశ్వరుడిశక్తి అనండి, నారాయణుడిశక్తి అనండి. ఏదో దివ్యమైన శక్తి, లోకోద్ధరణకి పనికొచ్చే ఆ శక్తి ఒక చిన్న బాలుడిగా వచ్చి సప్తఋషులని చూసి, చంటిపిల్లలు మన మెడ పట్టుకొని వేలాడినట్టు, ఒక ఋషి మెడ చుట్టూ చేతులు వేసింది. ఏమిటి నామెడ పట్టుకొని వేలాడుతున్నావు అన్నాడు ఆ ఋషి. అప్పుడు ఆ బాలుడు, ఈశ్వరసంకల్పంలో నేను భూమిమీదకి వెళ్తున్నాను. ఒంటరిగా వెళ్తున్నాను. నాకు సహాయం చెయ్యటానికి నా వెనకాల భూమిమీదకి వస్తావా అన్నాడు. నేను చెయ్యబోతున్న స్పిరిట్యువల్ వర్కుకి

నాకు సహాయం కావాలి. నాకు సహాయం చెయ్యటానికి నువ్వు వస్తావా అని అడిగితే ఆ సప్తఋషులలో ఋషి తల ఊపాడు. ఈ అగ్రిమెంట్ కుదిరిన తరువాత ఆ బాలుడు బెంగాలుదేశంలో కామర్పుకూరులో రామకృష్ణుడిగా జన్మించాడు. ఆ అగ్రిమెంట్‌ప్రకారం ఇతడు వచ్చిన కొద్దికాలానికి కలకత్తా పట్టణంలో ఆ ఋషి నరేంద్రనాధుడిగా విశ్వనాధ దత్త కుటుంబంలో జన్మించాడు. వాళ్ళిద్దరూ ముందు కూడబలుక్కుని ఈ భూమిమీదకి వచ్చారు. వాళ్ళమధ్య ఆప్యాయత ఈ జన్మకి సంబంధించిందే కాదు. అది జన్మాంతర అనుబంధం. అది ఒక జన్మ అయితే ఆ ప్రీతిపుట్టదు.

రామకృష్ణుడి గురించి మొట్టమొదటిలో నరేంద్రుడికి ఏమీ తెలియదు. నరేంద్రుడు ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు రామకృష్ణ పరమహంసతో పరిచయం అయ్యింది. అది ఎలా జరిగిందంటే విలియం వర్డ్స్‌వర్త్ ఇంగ్లీషులో ఒక పద్యం రాసాడు. అతడు నేచర్ పొయెట్. అతనుకూడా గ్రేట్ ఫిలాసఫర్. కాలేజీలో ఇంగ్లీష్ ప్రొఫెసరుకి నరేంద్రనాథ్ అంటే చాలా ఇష్టం. ఇన్ని టాలెంట్స్ ఉన్న స్టూడెంటుని నేను ఇప్పటివరకూ చూడలేదు అనేవాడు ఆయన. ఆ ఇంగ్లీషు ప్రొఫెసరు ఈ పోయమ్ చెప్తూ మానవుడు పరమ పవిత్రుడు అయితే మన ఇంటలెక్టుని మైన్డుని ప్యూరిఫై చేసుకోగలిగితే, గొప్ప స్థితి మనకి కలుగుతుంది. ఇప్పడే కలుగుతుంది. దానిని మా క్రైస్తవులు స్వర్గరాజ్యం అని, మోక్షరాజ్యం అని కింగ్డమ్ ఆఫ్ హెవెన్ అని అంటాము. హిందువులు మోక్షం అని దానికి పేరు పెట్టారు. బౌద్ధులు నిర్వాణము అంటారు. కానీ స్టేట్‌మట్టుకు ఒక్కటే. ఆ స్టేట్‌ని వర్డ్స్‌వర్త్ వర్ణించాడు. ప్యూరిఫైడ్ మేన్‌కి గొప్ప సమాధి స్థితి కలుగుతుంది. ప్యూరిఫైడ్‌సోల్ అయితేనే గ్రేట్‌సోల్ అవ్వగలదు. పరిణామంలో ఆ గొప్ప స్థితి వాడికి తెలియకుండానే కలుగుతుంది అని ఆ ఇంగ్లీష్ ప్రొఫెసర్ చెప్తూ యాక్సిడెంటల్‌గా ఒక మాట అన్నాడు. అది పరమేశ్వరుడి యొక్క ప్రేరణ, వర్డ్స్‌వర్త్ పోయమ్‌లో అయితే వర్ణించాడు కానీ, అది పోయెట్ యొక్క ఇమాజినేషన్. నిజంగా అటువంటి పరమపవిత్రులు పూర్వకాలంలో ఉన్నారు కానీ, ఈ రోజులలో ఎవరైనా ఉన్నారా అని మీకు అనుమానం రావచ్చు. ఈ కలకత్తా పట్టణానికి, మన కాలేజీకి చాలా దగ్గరిలోనే దక్షిణేశ్వరం అనే గ్రామం ఉంది. అక్కడ రామకృష్ణపరమహంస అని పిలవబడే ఒక సెయింట్ ఉన్నాడు. వర్డ్స్‌వర్త్ చెప్పినటువంటి సమాధిస్థితిని ఆ గొప్పస్థితిని చూడాలంటే మీరు దక్షిణేశ్వరం వెళ్ళి రామకృష్ణపరమహంసని చూడవచ్చు అని ఆ ప్రొఫెసర్ యాక్సిడెంటలుగా చెప్పిన మాటలు అతనికి ఈ విషయం ఎలా తెలిసింది. ఇంగ్లీష్‌వాడు మన హిందువుకాదు, కానీ ఈ మాటలు చెప్పాడు. ఈ వర్డ్స్‌వర్త్ పాఠం వినకముందే బ్రహ్మసమాజం యొక్క ప్రభావం వివేకానందమీద ఉంది. కానీ అనుభవం కనిపించటంలేదు. ఈ సబ్జెక్టు డ్రైగా ఉంది. బ్రహ్మసమాజం వాళ్ళు చెప్పే ఫిలాసఫీ డ్రైగా ఉంది. నాకు అనుభవం కావాలి అనేటువంటి తపన ఆయన హృదయంలో ఉండేది. మహాత్ములు అనేవాళ్ళ అందరి దగ్గరికి వెళ్ళేవాడు. మీరు దేవుడిని చూసారా? మీరు నాకు దేవుడిని చూపించగలరా? అని అడిగేవాడు. పుస్తకాలలో మాటలు వదిలేయండి. మీరు దేవుడి గురించి చెపుతున్నారు కదా. మీరు చూసిన దేవుడిని నాకూ చూపించగలరా? ఈ మాటలు వినివాళ్ళు నిర్ఘాంతపోయేవారు. రవీంద్రనాథ్‌ఠాగూర్ తండ్రి దేవేంద్రనాథ్‌ఠాగూర్ ఉపనిషత్తులు అవి బాగా చదివాడు. ఆయన దగ్గరికి నరేంద్రుడు వెళ్ళినప్పడు నేను నీకు దేవుడిని చూపించలేను కానీ, నీ కళ్ళు చూస్తుంటే

నువ్వు దేవుడిలాగే కనిపిస్తున్నావు అన్నాడు. నీ కళ్ళు నీ మాటలు చూస్తే నువ్వు సామాన్య మానవుడిలా కనిపించటంలేదు. ఒక మహాయోగి ఈ భూమి మీద జన్మించినట్టుగా నాకు అనిపిస్తోంది. నువ్వు ఎంత దాచుకున్నప్పటికీ నీ కళ్ళు చూస్తుంటే నువ్వు యోగివని తెలుస్తోంది అని దేవేంద్రనాధ్‌ఠాగూర్ స్పష్టంగా చెప్పాడు. ఆ మాటలు విని వీడొక పిచ్చివాడేమో అని మనస్సులో అనుకున్నాడు నరేంద్రుడు. ఎందుకంటే నరేంద్రుడు హేతువాది. ప్రొఫెసరుగారి మాటలు విన్నాక వెంటనే రామకృష్ణుడి దగ్గరికి వెళ్ళాలని ఏమీ అనిపించలేదు నరేంద్రుడికి. ఈయన ముందు దక్షిణేశ్వరం వెళ్ళలేదు. ఆ ప్రొఫెసర్ చెప్పింది హృదయంలో ఉంచుకున్నాడు అంతవరకే. రమణమహర్షిగారు ఎవరి ఇంటికీ వెళ్ళేవారు కాదు, కానీ రామకృష్ణ పరమహంసగారు ఎవరైనా భక్తులు వచ్చి ఈ రోజు మా ఇంటికి రావాలి అంటే వెళ్తూండేవారు. వాళ్ళు ఒంటెద్దు బండో గుఱ్ఱపుబండో పంపితే వాళ్ళ ఇంటికి వెళ్ళి ఒక గంట సేపు కూర్చుని ఆయనకి తోచింది చెప్పేవారు. వివేకానంద ఉన్న వీధిలో ఒక భక్తుడు రామకృష్ణుని వాళ్ళ ఇంటికి తీసుకొస్తూ, నరేంద్రుడితో నువ్వు పాటలు బాగా పాడతావు, మా గురువుగారికి పాటలు అంటే చాలా ఇష్టం. నువ్వు కొన్ని పాటలు పాడి వచ్చేద్దువుగాని అని పిలిచాడు. నరేంద్రుడు అద్భుతంగా పాడతాడు, అన్నీ తెలుసు ఆయనకి, గొప్ప పర్సనాలిటీ ఉంది. చదువులో అసాధారణ ప్రతిభావంతుడు, అన్ని మంచి లక్షణాలు, కళ్యాణ గుణాలు ఉన్నాయి. జరగవలసిన పని అలా దైవికంగా జరుగుతూ ఉంటుంది. నరేంద్రుడు పాడుతుంటే రామకృష్ణుడు తదేకంగా చూసాడు. ఏదో జన్మాంతర అనుబంధం. డిస్పర్స్ అయ్యేముందు మా దక్షిణేశ్వరం నువ్వు తప్పనిసరిగా ఒకసారి రావాలి అని నరేంద్రుడి దగ్గర మాట తీసుకున్నాడు. ఈ సంఘటన జరిగిన 10-15 రోజులకి ఇద్దరు ముగ్గురు కాలేజీ స్టూడెంట్స్‌తో కలిసి రామకృష్ణుడి దగ్గరకు వెళ్ళాడు. అతను రావటంతోనే పడమటి ద్వారం ద్వారా రామకృష్ణుడు గదిలో ప్రవేశించాడు. అతను కూర్చున్నాక, నరేన్ మనమిద్దరము లోపలికి వెళ్ళి కాసేపు మాట్లాడుకోవాలి అంటాడు రామకృష్ణుడు. ఎందుకంటే పక్కన అతనితో వచ్చిన స్టూడెంట్స్ ఉన్నారు, ఇతర డిసైపుల్స్ ఉన్నారు. నరేంద్రుడిని ప్రైవేటు రూములోకి తీసుకుపోయాడు. లోపలికి వెళ్ళాక నరేన్ ఇంతవరకూ నా దగ్గరకి వచ్చే వాళ్ళు అందరూ ఎక్కువ లౌకికులే, అందరూ ప్రాపంచిక మనుషులే, రామకృష్ణుడిని చూస్తే ఏదో మంచి జరుగుతుంది అనుకుని వచ్చేవాళ్ళే. లౌకికులకి తత్త్వం తెలుస్తుందా? ఇంతవరకూ ప్రాపంచిక జ్వరంతో బాధపడుతూ వచ్చిన వాళ్ళే. నరేన్ ఈ ప్రాపంచిక మాటలు వినీ వినీ, రోత పుట్టించే మాటలు వినీ వినీ, 24 గంటలూ సంసారానికి సంబంధించిన మాటలు వినీ వినీ నా చెవులు గళ్ళు పడిపోయాయి. ఈనాటికైనా ఒక భక్తుడు, మానవజాతి కోసం జీవితాన్ని సమర్పించటానికి సిద్ధంగా ఉన్న ఒక వ్యక్తి నా దగ్గరకి వచ్చి, ప్రాపంచిక మాటలు ఎత్తకుండా, కేవలం దైవీసంబంధమైన మాటలు నేను చెపితే వినటానికి తగిన అర్హత కలిగిన భక్తుడు ఈనాటికి నా దగ్గరకి వచ్చినందుకు నాకు సంతోషంగా ఉంది నరేన్. నా చెవులు చిల్లుపడిపోయాయి నరేన్ ఈ ప్రాపంచిక మాటలు వినలేకపోతున్నాను; భౌతిక ధనానికి ఆధ్యాత్మిక ధనానికి ఉన్న తేడా, కర్రతో చేసిన మామిడికాయకి నిజమైన మామిడి కాయకి ఉన్న తేడా వంటిది. ఆధ్యాత్మిక ధనం, భౌతిక ధనం, రెండూ ధనమే. ఈ భౌతిక ధనం ప్రెస్సులో ముద్రకొట్టే రూపాయలు కర్రతో చేసిన మామిడికాయ వంటివి. ఆధ్యాత్మిక ధనమే నిజమైన ధనం. నేను ఏదైనా ఆధ్యాత్మిక విషయాలు చెపుతూ ఉంటే, వినటానికి తగిన అర్హత యోగ్యత

ఉన్న వ్యక్తివి ఈనాటికి నా దగ్గరికి వచ్చావు నరేన్. నేను చాలా సంతోషంగా ఉన్నాను అన్నాడు. అప్పుడు బయటకు తీసుకువచ్చి, హృదయంలో ఉన్న ప్రేమ ఆప్యాయత పొంగి పొంగి వస్తుంటే ఆపుకోలేక అతనితో ఏవో తినుబండారాలు తినిపించాడు. వాడి ప్రేమ చూడండి. నాకే తినిపిస్తావేంటి, నా ఫ్రెండ్స్ వచ్చారు నా కూడా, నా ఒక్కడికేనా వాళ్ళకీ పెట్టు అంటాడు నరేంద్రుడు. నీకు నా చేత్తో పెట్టాలని ఉంది అంటాడు రామకృష్ణుడు. నీకు పెట్టిన స్వీట్సే వాళ్ళకి కూడా పెడతాను అని చెప్పేవరకూ గుటక వెయ్యలేదు నరేంద్రుడు.

సర్వసాధారణంగా ఆధ్యాత్మిక మార్గంలో ఉన్న వాళ్ళు మీరాభాయికానీ, సూరదాసు కానీ, తులసీదాసుగానీ, రామకృష్ణపరమహంసగానీ, వాళ్ళకున్న ఆధ్యాత్మిక అనుభూతులు కవిత్వం ద్వారా కానీ, మాటల ద్వారా కానీ, గొప్ప పొయెట్రీ ద్వారా కానీ వాళ్ళకి వచ్చిన అనుభవాన్ని ఎక్స్ప్రెషన్‌లో పెట్టేవారు. అది ఇమిటేషన్ కాదు. వాళ్ళకున్న స్పిరిట్యువల్ ఎక్స్పీరియన్స్‌ని. అది రచన ద్వారా అవ్వనివ్వండి, సత్సంగాల ద్వారా అవ్వనివ్వండి, పొయెట్రీ ద్వారా అవ్వనివ్వండి, ప్రత్యక్షమైన వాళ్ళ అనుభవాన్ని ఆపుచేసుకోలేక మానవజాతి సుఖం కోసం బయటకు వెల్లడించారు. ఆ ఎమోషన్ ఆపుచేసుకోవటం చాలా కష్టం. అలా ఎమోషన్ ఆపుచేసుకొని కూడా చాలా బ్యాలన్స్‌డ్‌గా మాట్లాడిన వాళ్ళు వరల్డ్ హిస్టరీలో ఇద్దరే కనిపిస్తారు; ఒకడు గౌతమబుద్ధుడు, రెండు రమణమహర్షి. వీళ్ళు ఎక్కడా ఎమోషన్‌కి గురి అవ్వలేదు. అందరి ఆధ్యాత్మిక అంతస్తు మటుకు ఒకటే. గౌతమబుద్ధుడు, రమణమహర్షి వాళ్ళిద్దరూ మాట్లాడుతూ ఉంటే ఒక స్టోనులోంచి వస్తున్నాయా ఆ మాటలు అనిపిస్తుంది. మనిషి మాట్లాడుతున్నాడా లేకపోతే స్టోనులోంచి మాటలు వస్తున్నాయా అనిపిస్తుంది. ఎప్పుడు ఎమోషన్‌కి గురి కాలేదు. ఒకో ఉపాధి ద్వారా అలా వ్యక్తం అవుతుంది. వీళ్ళిద్దరిలో ఏ రియాక్షన్ కనిపించదు.

నరేంద్రుడు మళ్ళీ నెలకో రెండు నెలలకో మళ్ళీ మూడోసారి వచ్చాడు. సరిగ్గా మూడోసారి వచ్చినప్పుడు మంచం మీద కూర్చుని ఉన్నాడు రామకృష్ణుడు. నరేంద్రుడు కింద కూర్చోబోతున్నాడు. నువ్వు కింద కూర్చోకు నాతో సమానంగా కూర్చో అని తన పక్కన కూర్చోపెట్టుకున్నాడు రామకృష్ణుడు. తన పాదస్పర్శ ద్వారా కొంత శక్తిని ప్రసాదించాడు నరేంద్రుడికి. అప్పుడు ఒక దివ్యమైనటువంటి, ప్రకృతికి అతీతమైన అనుభూతి అతనికి కలిగింది. రమణమహర్షి అసలు టచ్ చెయ్యడు. ప్రకృతికి అతీతమైన శక్తులు ప్రయోగించి నన్ను ఈ వ్యక్తి స్వాధీనం చేసుకొంటున్నాడు అనే భావన మీకు గౌతమబుద్ధుడు కానీ రమణమహర్షి కానీ అసలు కలగనీయరు. రామకృష్ణ పరమహంస చేసినది తప్పు కాదు మంచిదే. అదొక పద్ధతి. తన కుడికాలు అతని శరీరానికి తాకించి నరేంద్రుడిలో ఒక దివ్య మైనశక్తిని, ఆధ్యాత్మిక శక్తిని ప్రవేశింపచేసాడు. అప్పుడు నరేంద్రుడు ఏమిటి నాకు ఏమీ కనిపించటంలేదు. నాకు ఇంటిదగ్గర నాన్న అమ్మ ఉన్నారు. నా కళ్ళకి కనిపిస్తున్న ఈ దృశ్యమంతా కూడా అదృశ్యమైపోతోంది. నాకు భయం వేస్తోంది అంటాడు. అప్పుడు రామకృష్ణుడు ప్రస్తుతానికి ఇది దాటు అని చెప్పాడు. కొంతశక్తిని ప్రసాదించిన తరువాత ప్రస్తుతానికి ఇది చాలు అన్నాడు.

అయితే వివేకానందుడు డౌటర్. ఎంతసేపూ అనుమానించే స్వభావం ఉంది ఆయనకి. గురువునైనా గుడ్డిగా నమ్మొద్దు అని చెపుతాడు. రామకృష్ణ పరమహంసని ఎన్నో పరీక్షలకు గురిచేసాడు. నీకు అనుభవంలోకి రాకుండా ఎవరో ఎదుటివాళ్ళు చెప్పారని నువ్వు నమ్మవద్దు

అంటాడు. నరేన్ దూడని కొనేవాళ్ళు ఎన్నివిధాలుగా దానిని పరీక్షచేసి కొనుక్కుంటారో అదేవిధంగా నువ్వు ఎన్ని విధాలుగా అయితే నన్ను పరీక్షించాలని అనుకొంటున్నావో, అన్ని విధాలా నన్ను పరిశీలించే నువ్వు నన్ను గురువుగా తీసుకో, అని చెప్పేవాడు రామకృష్ణుడు.

రామకృష్ణ పరమహంసగారు రూపాయలు టచ్ చేసేవారుకాదు. అంటే ఆయన బాడీని అలా తయారుచేసాడు. ఒకసారి వివేకానంద రామకృష్ణుడి మంచం మీద దుప్పటి కింద రూపాయి పెట్టాడు. రామకృష్ణుడు మామూలుగా వచ్చి అక్కడ పడుకున్నాడు. తేలు కుట్టినట్టు అనిపించి శరీరం మండిందట. బాడీని అంత ప్యూరిఫై చేసాడు. దుప్పటి తీసి దులిపితే రూపాయి కిందపడింది. నరేంద్రుడు సిగ్గు పడుతున్నాడట అయ్యో మనం గురువుని ఇలా అనుమానించి పరీక్షలు పెడుతున్నాము అని. నువ్వు సిగ్గుపడకు. నేను చెప్పాను కదా. నువ్వు అనేక పరీక్షలుచేసుకో. ఎన్ని రకాల పరీక్షలు చేసుకోవాలనుకొంటున్నావో అన్ని రకాల పరీక్షలు చేసుకో అన్నాడు రామకృష్ణుడు. మనం ఏ పనికోసం వచ్చామో సద్గురువుకి తెలుస్తుంది. రామకృష్ణుడు చెప్పే మాటలని ఎప్పుడైనా వివేకానంద రాయటానికి ప్రయత్నం చేస్తే నువ్వు ఆగు అనేవాడట రామకృష్ణుడు. నువ్వు ఆ పనికోసం రాలేదు. ఆ పనికోసం వచ్చినవాడు మహేంద్రనాథ్ గుప్త . కలకత్తా హైస్కూల్‌లో ఆయన హెడ్ మాష్టారు. ఆయనని **M** అని పిలుస్తారు అందరూ అంటే మహేంద్రనాథ్ గుప్త. ఆయన గోస్పెల్ ఆఫ్ శ్రీ రామకృష్ణ పరమహంస అని ఒక గ్రంథం రాసారు. అది శాస్త్రముల యొక్క సారం. దానిని ఇంకో భాషలో మీకు చెప్పాలంటే మోడరన్ భగవద్గీత అన్నారు. ఆ గ్రంథం యొక్క గొప్పతనం మీకు తెలియటంకోసం చెపుతున్నాను. ఆయన రాసేపనికి వచ్చాడు. నేను చెప్పే మాటలు రాయటంకోసం నువ్వు రాలేదు నరేన్. నువ్వు చేసే పని వేరుగా ఉంది.

నరేంద్రుడిది క్షత్రియ ఫ్యామిలీ. యుద్ధాలు చేసే రేస్ కాబట్టి ఆ గుణాలు కూడా ఆయనలో ఉండేవి. ఉపద్రవమైన కోపం వచ్చేది ఆయనకు చిన్నతనంలో. అప్పుడు ఇంట్లోకుర్చీలు కూడా బద్దలుకొట్టేసేవాడు. తల్లి ఆయనని కుళాయి దగ్గరికి తీసుకెళ్ళి స్నానం చేయించి శివా శివా అంటే తగ్గేవాడట. ఒకసారి కోపం వచ్చి వాళ్ళ అమ్మని తిట్టటం ప్రారంభించాడట. ఏమిటి మీ అమ్మని అలా తిడుతున్నావు అని తండ్రి అనలేదట. వాడిని వెళ్ళిపోనిచ్చి ఈ రోజున నరేంద్రుడు వాళ్ళ అమ్మని తిట్టాడు అని. ఆయన తిట్టిన తిట్లన్నీ తలుపుమీద రాసాడట. ఆయన కాలేజీకి వెళ్ళిపోయాడు. ఈయన కోర్టుకి వెళ్ళిపోయాడు. జతగాళ్ళతో తిరగటం సరదా నరేంద్రుడికి. పుస్తకాలన్నా ఫ్రెండ్స్ అన్నా సరదా. నలుగురిలో కూర్చోవటం, నలుగురితో మాట్లాడటం ఇష్టం. నలుగురికి సేవ చేయాలని ఆ భావంతో ఉండేవాడు. ఇద్దరి స్నేహితులని తీసుకొని ఇంటికి వచ్చాడు కాలేజీనుంచి. సరిగ్గా తలుపుమీద ఈయన అమ్మని తిట్టినతిట్లు అన్నీ రాసి ఉన్నాయి. ఫ్రెండ్స్‌కూడా చదివి మీ అమ్మని ఇన్ని మాటలు అన్నావా అని వాళ్ళుకూడా అంటే తల వంచాడు. ఈ మాటలు అన్నీ నేను తిట్టినవేనా నా నోటితోనే తిట్టానా అని అనుకొంటున్నాడట. ఏదో కోపం మీద బరస్ట్ అయి అనేసాడు. నేను అమ్మని ఇన్ని చెడ్డమాటలు అనేసానా అని ఎంతో పశ్చాత్తాప పడ్డాడు. పైగా వీడు అమ్మని తిట్టిన తిట్లు వాళ్ళ స్నేహితులకి కూడా తెలిసిపోయాయి కదా, ఎంతో సిగ్గుపడ్డాడట. మరుసటి రోజు వాళ్ళ ఫాదర్‌ని అడుగుతాడు. నేను జీవితం పొడుగునా జ్ఞాపకం ఉంచుకొనే మాటలు. కృష్ణుడు చెప్పిన గీతలా, లేకపోతే

షేక్స్పియర్ డ్రామాలో చెప్పినమాటలులా. అటువంటి రెండు మంచి మాటలు నాకు చెపుతారా అని అడుగుతాడు. చిన్మయానంద వాళ్ళ గురువుగారిని ఒకసారి అలాగే అడిగాడట. ఆయన ఒకటే చెప్పారు. నువ్వు జీవించటం సన్యాసిలా నిరాడంబరంగా జీవించు, పని చేసేటప్పుడు గుర్రంలాగా పనిచెయ్యి అని చిన్మయానందకు చెప్పారట. వివేకానందుడికి వాళ్ళ ఫాదర్ ఏం చెప్పాడంటే, ప్రపంచంలో ఏది జరిగినా నువ్వు అప్సెట్ అవ్వద్దు అని చెప్పాడు. ప్రపంచంలో ఏ సంఘటన జరిగినా సరే నువ్వు రియాక్ట్ అవ్వద్దు. ఏ సంఘటన అయినా సరే ఆశ్చర్యపడవద్దు. నార్మల్‌గా జీవించు. నరేంద్రుడి ఫాదర్ చెప్పిన మాటలు ఎంత నేచురల్‌గా ఉన్నాయో ఎంత నార్మల్‌గా ఉన్నాయో చూడండి. ఆయన తండ్రి చాలా మంచివాడు కానీ దేవుడి పట్ల విశ్వాసం నమ్మకం లేవు. వివేకానంద తాతగారు భక్తుడే. వివేకానంద తండ్రి మటుకు దేవుడు ఇటువంటి భక్తి ఏమీ లేదు. అతని ప్రొఫెషన్ ఏదో అతను చూసుకునేవాడు, ఉపకారం మనిషి. పదిమందికి ఉపకారం చేసేవాడు.

వివేకానంద ఫాదర్ పోయిన తరువాత చాలా పావర్టీ అనుభవించాడు. వాళ్ళ కుటుంబం పావర్టీలో పడిపోయింది. భోజనానికి కూడా చాలా ఇబ్బంది పడ్డారు. అతని కంపేషన్ ఎటువంటిదంటే తల్లి తింటుందో తినదో అని అబద్ధాలు చెప్పేవాడట వివేకానంద. అమ్మా నేను ఈవేళ ఫలానా స్నేహితుడి ఇంటికి వెళ్ళాను, వాళ్ళు నాకు బలవంతాన అన్నం పెట్టారు అని చెప్పేవాడట. అంటే ఇంటి దగ్గర ఆ కాస్త అన్నం తను తినేస్తే, తనకోసం తల్లి తినటం మానేస్తుందేమో అని. అటువంటి పావర్టీ అనుభవించాడు. ఇటువంటి పావర్టీ అనుభవిస్తూ కూడా తన గురుదేవుడు పట్ల కానీ ఈశ్వరుడిపట్ల కానీ తన విశ్వాసం చలించలేదు, అది నిశ్చలంగానే ఉంది. అన్నీ బాగున్నంతసేపూ, టైముకి కాఫీ భోజనం వచ్చి అన్నీ సుఖంగా ఉన్నప్పుడు అందరూ భక్తులే. పరీక్ష వచ్చినప్పుడే తట్టుకోవాలి. రామకృష్ణుడు చెప్పాడు, నువ్వు ఇంత పావర్టీ అనుభవిస్తున్నావు కదా, నేను రోజూ ఆరాధించే కాళిని ఆ దేవిని అడుగవయ్యా, నేను ఇంటివద్ద చాలా బాధలు పడుతున్నాను, మాకు అన్నవస్త్రాలకు లోటు లేకుండా చూడమని దేవిని ప్రార్థించు. నువ్వు ఇంటి దగ్గర ఎంత బాధ అనుభవిస్తున్నావో నాకు తెలుసు అని చెప్పి ప్రోత్సాహం చేసేవాడు. అతను బోర్న్ సెయింట్, బోర్న్ సేజ్, బోర్న్ టీచర్ అని ఎందుకు చెపుతున్నానంటే, మనం గుడిలోకి వెళ్తే మనకి కావలసినవి అన్నీ దండకం చదివేస్తాము. మనకే కాదు మన మునిమనుమలు గురించి కూడా అడుగుతాము. అంత పావర్టీ అనుభవిస్తున్నప్పుడు కూడా, అటువంటి బాధలు కష్టాలు నష్టాలు ఇంటి దగ్గర అనుభవిస్తూ కూడా దేవి అన్నం అడిగితే అన్నం, బట్ట అడిగితే బట్ట ఇస్తుంది అని రామకృష్ణుడు చెప్పి ప్రోత్సహించి దేవుడిని అడగమన్నప్పుడు కూడా ఆ దేవుడిని చూసేసరికి కీప్ మై మైండ్ అవే ఫ్రం లస్ట్, యాంగర్ అండ్ గ్రీడ్ అనేవాడు వివేకానంద. అన్న వస్త్రాలు అడగటం మానేసి కీర్తి పట్లగానీ, ధనం పట్లగానీ, కామం పట్లకానీ, ఇటువంటి విషయాలకి నా మనస్సు దూరంగా ఉండేటట్లు చెయ్యి అమ్మా అని ప్రార్థించేవాడు వివేకానంద. ఈ లోక విషయాల పట్ల ఈ లోక కాంక్షల పట్ల నా మనస్సుని దూరంగా ఉంచు, ఈ ప్రాపంచిక జ్వరానికి దూరంగా ఉంచు నా మనస్సుని, ఈ రాగద్వేషాలకి కామక్రోధాలకి దూరంగా పెట్టు నా మనస్సుని తల్లీ అని ప్రార్థించేవాడు. రామకృష్ణుడు ఇదేమిటి నేను ఏం చెపుతున్నాను, నువ్వు ఇంటి దగ్గర ఇబ్బంది పడుతున్నావు,

అన్నం కావాలని అడుగు, బట్టలు కావాలని అడుగు, మీ ఇంటి దగ్గర ఏమీ లోటు లేకుండా రూపాయలు కావాలని అడుగు. తల్లిని ఇవి అడగమంటే నువ్వు అలా అడుగుతావేమిటి అంటే, గురువుగారూ మీరు చెప్పింది బాగానే ఉంది, కానీ అమ్మ ముఖం చూసేటప్పటికి అన్నం బట్టలు లోకానికి సంబంధించిన సంపదలు ఏవీ నాకు అడగాలని అనిపించటం లేదు. కానీ నా మనస్సును పవిత్రంగా ఉంచమని అడగాలని పిస్తోంది. మరి నేను ఏంచేస్తాను? మీరు చెప్పిన పాఠం అక్కడ అప్పచెప్పలేకపోతున్నాను అన్నాడట. మీరు చెప్పిన మాట అడగాలని ఉంది, కానీ అమ్మ ముఖం చూసేటప్పటికి ఫెయిల్ అవుతున్నాను, అసలు ఈ లోకానికి సంబంధించినవి ఏమీ నాకు అడగాలనిపించటం లేదు. వాడు బోర్న్ సెయింట్. అప్పుడు రామకృష్ణుడు చెపుతాడు సరే అమ్మ మాట వదిలేయి, నేను నీకు వరం ఇస్తున్నాను రేపటి నుంచి అన్న వస్త్రాలకి ఇంటి దగ్గర లోటు ఉండదు, నువ్వు అడగలేకపోతున్నావు కాబట్టి నేనే ఇస్తున్నాను నీకు ఆవరం అని రామకృష్ణుడు చెప్పాడు.

రామకృష్ణుడికి 1886లో క్యాన్సర్ వచ్చింది. అప్పుడు లా చదువుతున్నాడు నరేంద్రుడు. అతను బ్రిలియంట్ స్టూడెంట్ కాబట్టి చదువు మేము చెప్పించుకుంటాము అంటూ పెద్ద పెద్ద సంబంధాలు వచ్చేవి. రోజూ సంబంధాల గురించి ఆయనతో చెపుతూ ఉంటే మీరు నన్ను పెళ్ళి చేసుకో అంటున్నారు, కాముడు ఉన్న చోట రాముడు ఉండడు, రాముడు ఉన్న చోట కాముడు ఉండడు. ఇద్దరూ ఒకేచోట ఉండలేరు, ఇద్దరూ ఒకే హృదయంలో ఉండలేరు, ఇక్కడ రాముడు అన్నా ఉండాలి, కాముడు అన్నా ఉండాలి. ఈ హృదయంలో ఏదో ఒక్కటే. పెద్ద డౌరీలు పెద్ద కట్నాలు ఇస్తాం అన్నప్పటికీ అతను ఎన్నడూ ఎట్రాక్ట్ అవ్వలేదు - బికాజ్ హి ఈజ్ ఎ బోర్న్ సెయింట్. ఒక ప్రక్క లా చదువుతున్నాడు, గురువుగారికి క్యాన్సర్ వచ్చింది, లా పుస్తకాలు ఇంటి దగ్గర చదువుకుంటూ గురువుగారికి సేవ చేసుకొంటున్నాడు. ఆయన డౌటర్ కదా, రామకృష్ణుడు క్యాన్సర్‌తో బాధపడుతుంటే, ఏంటీ ఈయనని మనం దేవుడు గురువు మహాత్ముడు అనుకొంటున్నాము, క్యాన్సర్‌తోటి పీడింపబడుతున్నాడే, క్యాన్సర్‌తోటి శరీరం శుష్కింపబడిపోయిందే, వీడు నిజంగా దేవుడేనా? నిజంగా గొప్ప గురువేనా మహాత్ముడేనా అని లోపల అనుకొంటున్నాడు. ఒక ప్రక్కన ఆయనకి సేవ చేస్తూనే, ఈయన గురువు అనేది వాస్తవమా లేకపోతే భ్రాంతా అని సందేహం వచ్చింది. అప్పుడు రామకృష్ణుడు నరేన్‌తో అంటాడు ఎవడైతే రాముడో, ఎవడైతే కృష్ణుడో, ఆ రాముడే ఆ కృష్ణుడే రామకృష్ణుడుగా ఈ భూమి మీదకి వచ్చాడు. నేను ఈ రోజున బీదవాడిని అయిపోయాను. నా ఆధ్యాత్మిక శక్తులన్నీ నీకు సంక్రమింపచేసి, నా దగ్గరున్న స్పిరిట్యువల్ పవర్ అంతా నీకు ప్రసాదించి నేను బీదవాడిని అయిపోయాను నరేన్. నా శరీరం విడిచిపెట్టేసిన తరువాత మన శిష్యులందరికీ నువ్వు నాయకత్వం వహించి వీళ్ళందరినీ అభివృద్ధిలోనికి తీసుకొచ్చే బాధ్యత అంతా నీదే అన్నాడు రామకృష్ణుడు.

రామకృష్ణుడు 1866, ఆగష్టు 16వ తేదీన శరీరం విడిచిపెట్టాడు. అటువంటి మహాత్ముడిని స్మశానానికి తీసుకెళ్తుంటే ఆయన కూడా పదిమంది కంటే ఎక్కువ లేరు. మామూలు స్మశానంలో అందరినీ దహనం చేసే స్మశానంలోనే ఆయన శరీరాన్ని దహనం చేసారు. నా గురుదేవులు అంతటి మహాత్ముడిని మామూలు స్మశానంలో అందరినీ

తగులబెట్టినట్టు తగులపెట్టేసారు. రామకృష్ణుడు అనేవాడు ఈ భూమి మీదకి వచ్చి వెళ్లిపోయాడు అనే గుర్తు కూడా లేకుండా చేసేసారు. ఆయన అస్థికలు ఒకచోట పెట్టి దేవాలయం కట్టాలనే సంకల్పం నరేంద్రుడికి ఆరోజు వచ్చింది. ఆ సంకల్పం నెరవేరేవరకూ నా శిరస్సు మీద ఉన్న పాపం దిగదు అన్నాడు నరేన్. అమెరికాలో డబ్బులు సంపాదించి తీసుకొచ్చి బేలూరులో స్థలం కొని, ఆ అస్థికలు జాగ్రత్త పెట్టి ఉంచి, బేలూరులో లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి గొప్ప దేవాలయం కట్టిన తరువాత, నా శిరస్సు మీద పాపం ఇప్పుడు క్రింద పడింది అని అన్నాడు, వాడు నరేంద్రుడు.

వివేకానంద భారతదేశానికి ఇచ్చిన మెసేజ్ ఒకటే, మీరు మంచి చేసినా చెడ్డ చేసినా నాకు ఇష్టమే, మీరు నిర్భయంగా చెయ్యండి అన్నాడు. బి ఫియర్లెస్, బి ఫియర్లెస్. మీరు చెడ్డ చేసినా నాకు ఇష్టమే. ఏ పని చేసినా భయం లేకుండా చెయ్యండి, మీకందరికీ దేవుడి మీద విశ్వాసం కాదు, మీమీద మీకు విశ్వాసం ఉండాలి, నామీద నాకు విశ్వాసం లేకపోతే, నేను ఏదీ కూడా గొప్ప పని చెయ్యలేను అని చెప్పాడు. ముందు నా మీద నాకు విశ్వాసం ఉండాలి, తరువాత దేవుడి మీద విశ్వాసం, ఇనుప కండరములు ఉక్కు నరములు కలిగి ఉండే మనుషులుగా ఉండాలి. మానవులారా! మీరు ముందు చదవవలసినది భగవద్గీత కాదు, మీకు ముందు ఆరోగ్యం ప్రధానం. మీకు ఆరోగ్యమైన శరీరం, ఆరోగ్యమైన మనస్సు కనుక లేకపోతే, శారీరక మానసిక రుగ్మతలతోటి మీరు బాధపడుతుంటే, వాలీబాల్ ఏమి ఆడగలరు, ఫుట్‌బాల్ ఏమి ఆడగలరు, ఇంటికొచ్చి మీరు భగవద్గీత ఏమి చదవగలరు అన్నాడు నరేంద్రుడు. మీకు ముందు కావలసినది ధైర్యం. ఈ లోకమంతా మిమ్మల్ని వ్యతిరేకించినా సరే, మీ ఆదర్శాలకి ఈ లోకం అడ్డు వస్తూ వుంటే, గ్రౌండులో ఫుట్‌బాల్‌ని తన్నినట్టు ఈ లోకాన్ని కూడా తన్నమన్నాడు. ఇఫ్ యు వాంట్ గాడ్ అండ్ గాడ్ అలోన్ కిక్ దిస్ వరల్డ్ మెర్సీలెస్‌లీ. నువ్వు ఒక ఆదర్శాన్ని ఒక ఐడియల్‌ని పెట్టుకొన్నప్పుడు, ఒక ఆకాంక్షని పెట్టుకొన్నప్పుడు, దానికోసం ఎంత శాక్రిఫైస్‌కైనా సరే, అవసరమైతే మరణానికి అయినా సరే, ఈ గంటలో నీకు మరణం వచ్చినా సరే, దానికోసం నువ్వు సిద్ధంగా ఉండు. మరణాన్ని ఫేస్ చెయ్యటం కోసం ప్రతి సెకను సిద్ధంగా ఉండు. బలహీనులకి బద్ధకస్తులకి పిరికివాళ్లకి సత్యం తెలియదు, ఆత్మ తెలియబడదు అన్నాడు నరేంద్రుడు.

1886వ సంవత్సరంలో గురువు శరీరం మరణించిన తరువాత శిష్యులు అందరూ చెల్లాచెదురు అయిపోయారు. తను ఒక్కడే వాళ్లందరి ఇళ్లకి వెళ్లి గురువుపోతే మనం ఇలా చెల్లాచెదురు అవ్వటం ఏమిటని వాళ్లందరినీ చేరదీసి - రాఖాల్ వంటి వాళ్లందరినీ కూడగట్టి, అద్దె ఇవ్వటం కూడా కష్టం అయినా, చివరికి ఒక గది అద్దెకు తీసుకుని, ఆగదిలో కార్యక్రమాలు ప్రారంభించాడు. ఒక ట్రావెలర్‌గా ఈ దేశంలో ప్రజల కష్టసుఖాలు ఏమిటి? వాళ్లు ఎటువంటి పరిస్థితులలో ఉన్నారు అని తెలుసుకోవటం కోసం దేశం అంతా తిరగటం ప్రారంభించాడు. రెండు సంవత్సరాలు దేశం అంతా తిరిగాడు. ఇండియా అంతా తిరుగుతూ అనేక మందిని కలుసుకున్నాడు. బీదవాళ్లనీ, ధనవంతులనీ, మహారాజులనీ, సన్యాసులనీ కలుసుకున్నాడు, దేశంలో దారిద్ర్యాన్ని చూసాడు. ఏమిటి ఇంత దారిద్ర్యం ఉంది భారతదేశానికి, ఎవరు ఈ దేశాన్ని, ఈ సామాన్య ప్రజలని ఉద్ధరిస్తారు? దేశంలో ఉన్న పావర్టీని చూసి చలించిపోయి ఈ

దేశంలో ప్రజలనందరినీ ఉద్ధరించాలనే కాంక్ష, తన జీవితాన్ని అంతా కూడా సామాన్య ప్రజానీకానికి సమర్పించాలి, తన శేషజీవితాన్ని అంతా కూడా దేశమాతకి సమర్పించాలనే నిర్ణయానికి వచ్చాడు. దేశం అంతా తిరిగి చూసిన తరువాత, ఆకలితోటి మాడిపోతున్న మనుషులకి నువ్వు మతం గురించి, దేవుడి గురించి ఏం చెపుతావు, ఆకలితోటి మాడిపోతున్న మనుషులకి భగవద్గీత బోధిస్తావా అన్నాడు నరేంద్రుడు. ముందు వాడికి ఆకలి తీర్చి తరువాత భగవద్గీత గురించి చెప్పు. నువ్వు వాళ్ళ ఆకలి తీర్చకుండా, అన్నమో రామచంద్రా అంటూ వాళ్ళ జీవితమంతా బ్రెడ్డు కోసమే ఖర్చు పెడుతుంటే వారికి నువ్వు భగవద్గీత గురించి చెపుతావా?

అమెరికాలో చికాగో నగరంలో 1893వ సంవత్సరం సెప్టెంబర్ 11న ప్రపంచ మత మహాసభ ప్రారంభమయ్యింది. వివేకానంద చికాగో వెళ్ళటానికి మద్రాసు వాళ్ళు ఎక్కువ ప్రోత్సాహం చేసారు. వాళ్ళు కొంత డబ్బు పోగుచేసి వివేకానందని చికాగో పంపించారు. ప్రయాణం ఖర్చు మాత్రం ఇచ్చారు, వాళ్ళు ఇచ్చిన డబ్బు అంతా కూడా అక్కడికి వెళ్ళేసరికి ఖర్చు అయిపోయింది. చికాగో నగరంలో ఒకచోట చలిలో బాధపడుతూ కూర్చుంటే, ఒక అమ్మగారు చూస్తారు. ఇతనికి బట్టలు మాసిపోయి ఉన్నాయి, ఒక బెగ్గర్‌లాగ ఉన్నాడు. ఆ అమ్మగారి భర్త ప్రొఫెసరు. నువ్వు ఎక్కడినుంచి వచ్చావు అంటే, నేను ఇండియా నుంచి వచ్చాను అన్నాడు. ఏం పనిమీద వచ్చావు? ఇంత బాధ పడుతున్నావు? ఈ స్ట్రీట్‌లో చూస్తున్నాను రెండు రోజుల నుంచి అని అడిగింది. నేను చికాగో నగరంలో మత మహాసభలో మాట్లాడటానికి వచ్చాను అని చెపుతాడు. నీ దగ్గర ఏమైనా పరిచయ ఉత్తరం ఉందా అంటే, ఉంది కానీ పోయింది అంటాడు. చికాగోలో మత మహాసభ ఆర్గనైజర్స్‌కి వీళ్ళకి పరిచయం ఉంది. ఈవిడ రెండు రోజులు ఆదరించి భర్తకి రికమెండ్ చేస్తుంది, ఆయన పరిచయ ఉత్తరం ఇస్తాడు వివేకానందకి మాట్లాడే అవకాశం ఇవ్వమని. ఈవిడ బట్టలు ఒక కోటు కుట్టించి ఇస్తుంది. ఆ నాలుగు రోజులు భోజనం పెట్టి ఆదరించి చికాగో సభకి పంపిస్తుంది. సభకు వెళ్ళి ఆ పరిచయ ఉత్తరం చూపిస్తాడు. అది చాలా పెద్ద సభ. ఇతన్ని కూడా స్టేజీ మీద కూర్చోబెట్టారు. పేరులు చదువుతారు ఫలానా వాళ్ళు మాట్లాడతారు అని. స్వామి వివేకానంద ఫ్రం ఇండియా అని పిలుస్తారు. ఇంతమంది జనంలో ఎప్పుడూ మాట్లాడలేదు, ఇతనికి భయం వేసింది. అప్పటికి ఆయనకి 29 ఏళ్ళు. మళ్ళీ కూర్చున్నాడు. ప్రిసైడ్ చేసేవాడు కనిపెట్టాడు ఈయన భయపడుతున్నాడని, రెండోసారి మళ్ళీ పిలిచారు వివేకానంద ఫ్రం ఇండియా అని. ఈసారి కనుక మాట్లాడకపోతే మళ్ళీ అవకాశం ఇవ్వరు. తలపాగా చుట్టుకున్నాడు, జడుస్తూ వచ్చాడు మైక్ దగ్గరకి. ఏమి అనాలి? ఎలా అడ్రస్ చెయ్యాలో తెలియదు. ఇంగ్లీష్ వాళ్ళ సాంప్రదాయం, లేడీస్ అండ్ జంటిల్మెన్ అంటారు. ముందు మాట్లాడిన వాళ్ళు అందరూ లేడీస్ అండ్ జంటిల్మన్ అని సంబోధించి ఒకో అరగంట సేపు మాట్లాడి కూర్చున్నారు. ఈయనను రామకృష్ణుడు గైడ్ చేస్తున్నాడు, ఉపన్యాసం ఇంకా ప్రారంభించలేదు. ఇతను అప్రయత్నంగా సిస్టర్స్ అండ్ బ్రదర్స్ ఆఫ్ అమెరికా అన్నాడు, ఒకసారి కరెంట్ షాక్‌లా తగిలి కూర్చున్న వాళ్ళందరూ పైకి లేచి క్లాప్స్ కొట్టారు. పది నిమిషాలు పట్టిందట సద్దుమణగటానికి. మన మాటల ప్రభావం వీళ్ళ మీద ఉంది. ఇంక మన సబ్జక్టు మాట్లాడవచ్చు అని విపరీతమైన గుండెధైర్యం వచ్చేసింది. మన ఇండియా గురించి ఎక్కువ మాట్లాడేసాడు, అంతకుముందు వరకు ఆయన ఒక అన్నోన్

సన్యాసి, ఒక గంటలో వరల్డ్ ఫేమస్ అయిపోయాడు. వివేకానంద అంటాడు రోడ్డు మీద తిరిగే సన్యాసి, భోజనానికి కూడా కష్టపడే సన్యాసి, జేబులో డబ్బులు ఏమీ లేనటువంటి సన్యాసి ఒక గంట చికాగో సభలో మాట్లాడేటప్పటికి, అమెరికన్ ప్రెస్ అంతాకూడా ఇతని ఫోటో ఫస్ట్ పేజీలో వేసి ఇతని అడ్రస్ అంతా కూడా ఫ్రంట్ పేజీలో వేసేసరికి ఒక గంటలో వరల్డ్ ఫేమస్ అయిపోయాడు. ఇది గురువు యొక్క కృప. అంతకు ముందు డబ్బులకోసం ఇబ్బంది పడుతున్నాడు, ఇప్పుడు ప్రపంచ ప్రఖ్యాతి పొందాడు. అమెరికన్ ప్రెస్ ఎప్పుడైతే ప్రాముఖ్యత ఇచ్చిందో, అప్పుడు మన ఇండియన్ ప్రెస్ కూడా మొదలు పెట్టింది. మన ఇండియా నుంచి వెళ్ళాడు, అమెరికన్ ప్రెస్ ఇంత టాప్ మోస్ట్ ఇంపార్టెన్స్ ఇచ్చేస్తోంది, వాడేదో సన్యాసి అని మనం అనుకుంటున్నాము, మనం కూడా ప్రాముఖ్యత ఇవ్వాలి అని వీళ్ళు కూడా ఫస్ట్ పేజీలో వెయ్యటం ప్రారంభించారు. ఈ అవకాశం అతను ఉపయోగించుకున్నాడు. అమెరికాలో అతన్ని టీచరుగా బుక్ చేసేసి టికెట్టు పెట్టేవారు. వివేకానంద ఉపన్యాసం ఫలానా చోట ఫలానా రోజు అని కమ్యూనికేషన్ ఇచ్చేసేవారు ముందు. టికెట్టు పెడితే విపరీతమైన డబ్బు వచ్చేసింది. అమెరికా వాళ్ళ దగ్గర ఒక గొప్పతనం ఉంది. వాళ్ళకి నచ్చితే డబ్బులు ఇచ్చి వింటారు, సంగీతమైనా సరే, ఉపన్యాసం అయినా సరే, ఎంతైనా సరే డబ్బు పెట్టి కొనేసి వింటారు. మన ఇండియాలో ఆ అలవాటు లేదు కానీ అమెరికాలో ఆ అలవాటు ఉంది. అమెరికాలో కొన్ని కంపెనీలు కాంట్రాక్టు చేసుకున్నాయి వివేకానందతో. కొంత మొత్తం ఆయనకి ఇచ్చేసేవారు. అమెరికా భౌతికంగా ఇంత అభివృద్ధిలోకి వెళ్ళింది, మన వాళ్ళు ఏమీ కష్టపడటం లేదు, మనవాళ్ళు సోమరితనానికి అలవాటు పడిపోయారు అనుకొనేవాడు. వాళ్ళ ఐశ్వర్యం చూసి వాళ్ళతో మన ఇండియాని పోల్చుకొని, మన ఇండియాలో ఇంత పావర్టీ ఉంది కదా అని, రాత్రి పదింటికి పడుకున్న మనిషి ఒంటి గంట వరకు పరుపులు తడిచేలా ఏడ్చేవాడంట. నువ్వు అమెరికాలో సెటిల్ అయిపో ఎందుకు భారతదేశం వెళ్ళటం అని స్నేహితులు అంటే వివేకానంద అన్నాడట, భారతదేశం యొక్క మట్టి, ఆ భూమే నాకు స్వర్గం. ది సాయిల్ ఆఫ్ ఇండియా ఈజ్ మై హయ్యెస్ట్ హెవెన్. నాకు స్వర్గం ఎక్కడో లేదు భారత భూమే నాకు స్వర్గం అని చెప్పాడట. రాత్రి ఒంటిగంట వరకూ పరుపులు తడిచేలా ఏడ్చేవాడటండీ భారత దేశం ఇలా ఉంది ఏమిటి అని?

అక్కడి నుండి లెటర్స్ వ్రాస్తూ ఉండేవాడట. మనం ఇలా కూర్చోవటం కాదు, జీవుడిలో కూడా శివుడిని చూడాలి. మన హిందూమతాన్ని ప్రచారం చెయ్యాలి, మన హిందూమతాన్ని అభివృద్ధిలోనికి తీసుకురావాలి. కేవలం నన్ను ముట్టుకోకు నన్ను ముట్టుకోకు అనే మతంగా హిందూమతాన్ని తయారు చేసారు. కేవలం వంటింటికే పరిమితం అయిపోయింది సనాతనమైన మన హిందూమతం. మతం పేరు మీద మన విద్యా సంస్థలని అభివృద్ధిలోనికి తీసుకురావాలి. భారతదేశాన్ని ఆర్థికరంగంలో సాంఘికరంగంలో, అన్ని రంగాలలో కూడా ముందుకు తీసుకువెళ్ళాలి. మనకి సంసారాలు లేవు కాబట్టి మన జీవితాలని అంతా కూడా భారతదేశం కోసం భారతభూమి కోసం రామకృష్ణుడి పేరు మీద దేవుడి పేరుమీద మన శక్తిని యుక్తిని మన తెలివితేటలని అంతా కూడా దేశానికి ఖర్చు పెట్టాలి. కొంతమంది వాళ్ళ తెలివితేటలను డబ్బు చేసేసుకుంటారు. కానీ మనకున్న తెలివిని అంతా కూడా భారతదేశానికి ఖర్చు పెట్టాలి అని తన సోదర డిసైపిల్స్ అందరికీ ఉత్తరాలు వ్రాస్తూ ఉండేవాడు.

వివేకానంద అమెరికా నుండి తిరిగి వచ్చిన తరువాత అతనికి సన్మానాలు ప్రారంభించారు. ఏమిటి నాకు ఇంత సన్మానాలు చేస్తున్నారు? ఏం గొప్పవాడు అయ్యాడని చేస్తున్నారు? అమెరికా వాళ్ళు పొగిడారని మీరు కూడా పొగుడుతున్నారా? ఈ కలకత్తా వీధులలో మీ అందరి ఎదురుగుండా తిరిగిన వాడే కదా నరేంద్రుడు. వీడు మీ నరేంద్రుడు అన్నాడు. అసలు ప్రజాసేవ చెయ్యాలి, ప్రజల కోసమే జన్మించాలి అనేవాడు. అయాం బోర్న్ నాట్ టు డై, బట్ టు డు గ్రేట్ థింగ్స్ ఇన్ ది వరల్డ్. నేను కేవలం సామాన్య మానవుడిలా మరణించటానికి ఈ భూమి మీద పుట్టలేదు, మహత్తర కార్యాలు సాధించటం కోసం ఈ భారత భూమి మీద పుట్టాను. అతని స్లోగన్ బి ఫియర్లెస్, బి ఫియర్లెస్. ఒక ప్రక్క వెస్ట్రన్ కంట్రీస్ అభివృద్ధి పొందుతుంటే అసలు అభివృద్ధి అంటే ఏమిటో తెలియకుండా భారతజాతి అంతా నిద్రపోతుంటే, మొట్టమొదట భారతజాతిని మేల్కొలిపిన వాడు స్వామి వివేకానంద అని జవహర్‌లాల్ నెహ్రూ తన డిస్కవరీ ఆఫ్ ఇండియాలో చెప్పాడు. అతనికి సర్వసాధారణంగా బీద ప్రజలు అంటే అపారమైనటువంటి ప్రేమ. కేవలము ఈ దేవాలయాలలో పూజలు చేసే అర్చకులు ఈ హిందూమతాన్ని సొంతం చేసేసుకున్నారు. హిందూమతం అంటే వాళ్ళదే అనుకొంటున్నారు. కానీ ఒక్క గుడిలోనే కాదు ప్రతి జీవుడిలోనూ శివుడు ఉన్నాడు. ప్రతి దేహమూ దేవాలయమే అందుచేత జీవుడినే శివుడిగా ఆరాధించి జీవసేవ చేయమని అతను ప్రవచించటం ప్రారంభించాడు. నరేంద్రుడు స్కూలులో చదువుతున్న రోజులలో ఒక దేవుని పటం కొనుక్కుని ఇంటికి తెచ్చుకొంటున్నాడు, దారిలో రోడ్డుమీద ఒక ముసలావిడ గాల్పుకొట్టి పడిపోయింది, అప్పుడు ఈ దేవుడి పటం రోడ్డు ప్రక్కన పెట్టి ఆవిడకి మంచినీళ్ళు పోస్తున్నాడు. అపచారం దేవుడి పటం క్రింద పెట్టేసావు, అలా రోడ్డుమీద పెట్టకూడదు, దేవుడి పటం క్రిందపెట్టేసి ఆవిడకి సేవ చేస్తున్నావేమిటి అని అన్నారట. పటంలో ఉన్న దేవుడికి కాదు బ్రతికున్న దేవుడికి నేను సేవ చేస్తున్నాను అన్నాడట నరేంద్రుడు. వాడు పటంలో దేవుడు, నేను బ్రతికున్న దేవుడికి సేవ చేస్తున్నాను అని చెప్పాడు.

ఎంతో ధనం సంపాదించాడు వివేకానంద. బేలూరులో స్థలం అంతా కూడా ఒక అమెరికన్ లేడీ కొనిచ్చిందట. అక్కడ ఒక సంస్థని స్థాపించారు - అందులో రామకృష్ణ మఠ్, రామకృష్ణ మిషన్ పెట్టారు. మఠ్ సన్యాసులకి ట్రైనింగ్ ఇచ్చే సంస్థ, రామకృష్ణ మిషన్ ద్వారా సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ప్రపంచంలో ఉన్న గొప్ప సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్స్‌లో రామకృష్ణ మిషన్ ఒకటి. బేలూరులో హెడ్ క్వార్టర్స్ స్థాపించిన తరువాత నరేంద్రుడు చెప్పాడు - నాకు తమ్ముడు ఉన్నాడు, ఫ్యామిలీ ఉంది. ఈ ఆస్తులు అన్నీ చూస్తే నా పేరు మీద ఉన్నాయి. రేపు నా శరీరం పడిపోతే నా ఫ్యామిలీ మెంబర్స్ ఈ ఆస్తులు మావి అంటారు. అందుచేత ట్రస్ట్ ఒకటి ఏర్పాటు చేద్దాము, రామకృష్ణుడి పేరుమీద ఒక మఠం పెడదాము. ఈ ఆస్తులు అన్నీ కూడా దానికి రాసి ఇచ్చేస్తాను. దానికొక కమిటీ వెయ్యాలి అన్నాడు. రామకృష్ణుడి డైరెక్ట్ డిసైపుల్స్ అందరూ కూడా మొట్టమొదట ఆ కమిటీకి మీరు ప్రెసిడెంటుగా ఉండాలి అన్నారట, నేను ప్రెసిడెంటుగా ఉండను, నేను ప్రెసిడెంటుగా ఉండే సమస్యలేదు అన్నాడు వివేకానందుడు. అయితే మీరే చెప్పండి ప్రెసిడెంటుగా ఎవరు ఉంటే బాగుంటుందో అన్నారట వాళ్ళు. అప్పుడు వివేకానందుడు అన్నాడు, మీరు ఇంత అసమర్థులు

అని నేను ఎప్పుడు అనుకోలేదు, మీరు 16 మంది కలిసి ఒక ప్రెసిడెంటుని, ఒక సెక్రటరీని, ఒక ట్రెజరరుని ఎన్నుకోలేని మీరు, దేశానికి, ప్రపంచానికి సేవ చేస్తారని నేను ఎలా అనుకొంటాను అన్నాడట. అప్పుడు వాళ్ళు బ్రహ్మానందని ఎన్నుకొన్నారట మొట్టమొదటి ప్రెసిడెంటుగా. ఆయనని రామకృష్ణుడు నా మానసపుత్రుడు అనేవారంట. కృష్ణుడి కాలంలో గోపబాలకులలో ఈ బ్రహ్మానంద ఒకడు అని చెప్పాడు రామకృష్ణుడు. శారదానంద అని రామకృష్ణుడి భార్య శారదపేరు పెట్టుకొన్నాడు, ఆయనని సెక్రటరీగా ఎన్నుకొన్నారు, అతడు బిడ్డలాగ చూసాడు రామకృష్ణుడి భార్యని. శారదామాతకి ఈ శారదానంద అంటే ఎంత ఇష్టం అంటే, ఆఖరున ఆవిడ శరీరం విడిచిపెట్టేటప్పుడు నా శరీరానికి నీ చేత్తో నిప్పు పెట్టమని అడిగిందట. లాస్టులో శారదామాత శరీరం విడిచిపెట్టేప్పుడు రెండు మంచి మాటలు చెప్పమని శారదానంద ఆవిడని అడిగితే టోలరెన్స్ టోలరెన్స్ అని చెప్పింది.

స్వామి బ్రహ్మానందని ఫస్ట్ ప్రెసిడెంటుగా శారదానందని సెక్రటరీగా ఎన్నుకున్నారు. ఇక వివేకానంద మొత్తం వెస్ట్రన్ కంట్రీస్ అన్నీ రెండుసార్లు తిరిగి వచ్చాడు చివరి రోజులలో. భోగాలైతే అనుభవిస్తున్నారు కానీ వాళ్ళకి తెలియకుండా వాళ్ళ హృదయాంతరాళాలలో చాలా దుఃఖం కూడా ఉండటం చూసాడు. భోగాలంటే బాగున్నాయి కానీ జీవితానికి గమ్యం మట్టుకు అవి కాదు, ధనం అవసరమే అయితే జీవితం యొక్క గమ్యం మట్టుకు అది కాదు. మన హిందువులు చెప్పినటువంటి ఆత్మే గమ్యం, సత్య సాక్షాత్కారమే గమ్యం. అయితే మానవుడికి బాడీ ఉంది కాబట్టి, ఆ బాడీని కంఫర్ట్‌గా ఉంచుకోవాలి కాబట్టి మనీ కూడా కొంత అవసరం. దేశాన్ని భాగ్యవంతంగా ఉంచటం కూడా అవసరం. స్వామి వివేకానంద ఒక మాట అంటాడు దేవుడి గుళ్ళోకి వెళ్ళినప్పుడు దేవుడికి పూజ చేస్తున్నాను అనుకొంటావు, మరి బీదవాడికి సహాయం చేస్తున్నప్పుడు సేవ అని ఎందుకు అనుకుంటావు. పూజ అని నువ్వు ఎందుకు అనుకోవు? అక్కడే నీ బలహీనత ఉంది అన్నాడు. ఎంత గొప్పమాటో చూడండి వివేకానంద చెప్పిన మాట! ఎంత అపూర్వంగా ఎంత ఉదాత్తంగా ఉందో చూడండి ఈ మాట! మీరు దేవాలయానికి వెళ్ళి దేవుడికి చేసేది పూజ అనుకుంటున్నారు. అదే ఒక బీదవాడికి సహాయం చేసినప్పుడు సేవ చేస్తున్నాను అంటావు కానీ ఆ బీదవాడికి కూడా పూజ చేస్తున్నాను అని ఎందుకు అనుకోవు? ఎంత గొప్ప ఎక్స్‌ప్రెషనో చూడండి. వీడు దేవుడు కాదా! వీడు నరరూపంలో ఉన్న నారాయణుడు కాదా! వీడు దరిద్రుడే అవ్వవచ్చు కానీ దరిద్రుడి రూపంలో ఉన్న నారాయణుడు కాదా!

విద్యారంగంలో, వైద్యరంగంలో మన దేశానికి రామకృష్ణ మిషన్ ద్వారా రామకృష్ణ మఠ్ ద్వారా అనేక స్కూళ్ళు అనేక కాలేజీలు పెట్టారు. అనేక సేవాసంస్థలు స్థాపించి ఎక్కడ ఏ రకమైనటువంటి ప్రకృతి బాధలు, ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పటికీ వాళ్ళు వెళ్ళి ఎన్నో సేవలు కూడా చేసారు. ఆయన సంకల్పం, ఆయన ఆశీర్వచనాలు ఈ రోజున కూడా రామకృష్ణ మిషన్ మీద ఉన్నాయి కాబట్టి, ఆ సంకల్పబలం ఈరోజున కూడా అంత బలంగా పనిచేస్తోంది కాబట్టి ఇప్పటికీ వాళ్ళు ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రపంచ మహాసంస్థలలో ఈరోజున రామకృష్ణ మిషన్ ఒకటి. కొన్ని కోట్లాది రూపాయల ఆస్తిగల సంస్థలలో ఈరోజున రామకృష్ణ మిషన్ ఒకటి.

వివేకానంద చెప్పతూ ఉండేవాడట జీవితంలో నేను నా నలభైయవ సంవత్సరము మట్టుకు చూడను అనేవాడట. నీకు నలభై సంవత్సరాలు నిండటం నువ్వు చూడవు నరేన్ అనేవాడట రామకృష్ణుడు, అంటే ఈ లోపులో ఆయన శరీరం విడిచిపెట్టేస్తాడని చెప్పటం. వివేకానంద శరీరం విడిచిపెట్టింది 1902వ సంవత్సరం జూలై నెల నాల్గవ తేదీ, ఆ రోజున ఆయనకి బ్లడ్ ప్రెషర్ ఎక్కువగా ఉంది. విపరీతమైన ప్రయాణాలు, ఐ యామ్ కిక్డ్ లైక్ ఎ ఫుట్బాల్ ఫ్రం వన్ ప్లేస్ టు ఎనదర్. ఇవాళ బాంబేలో ఉంటే రేపు కలకత్తాలో ఉండేవాడు. ఎల్లుండి ఆల్మోరాలో ఇంకోరోజున కొలంబోలో ఉండేవాడు. ఇలా దేశం అంతా ప్రపంచం అంతా తిరగటం వల్ల విశ్రాంతి లేని జీవితం గడిపి 1902వ సంవత్సరం జూలై నెల నాల్గవ తేదీ శరీరం విడిచిపెట్టాడు. ఆ రోజున మార్నింగ్ మటుకు సుఖంగా ఉన్నాడు, సంస్కృత గ్రామర్ లెసన్స్ కూడా ఎవరికో చెప్పాడు. మధ్యాహ్నం 3-4 గంటలకి షికారుకి వెడుతూ ఉండేవాడు గంగ ఒడ్డున. ఆరోజున కూడా షికారుకి వెళ్తూ నడుస్తూ కో-డిసైపుల్తో వివేకానందుడు ఈ లోకానికి వచ్చాడు ఏమి చేసాడు అని ప్రశ్నించాడు? అయితే అతను ఏమీ మాట్లాడటం లేదు. ఈ లోకంలోకి వివేకానంద వచ్చి, ఈ లోకంలో ఏం పని చేసి వెళ్ళిపోయాడో తెలుసుకోవాలంటే ఇంకో వివేకానందుడికి కానీ మామూలు వాడికి తెలుస్తుందా? వివేకానంద లాంటి వారిని భవిష్యత్తులో భారతదేశం అనేకమందిని చూస్తుంది. మీకు కాకపోయినా వాళ్ళకైనా అర్థం అవుతుంది అన్నాడు. వాడు వివేకానందుడు అంటే.

లోపలికి వచ్చాడు, అందరినీ తప్పకోమన్నాడు, తలుపులు వేసుకొని లోపల ప్రశాంతంగా పడుకున్నాడు. ధ్యానస్థితిలోకి వెళ్ళిపోయాడు, అంతే హై బ్లడ్ ప్రెషర్ వల్ల నోట్లోంచి కొంచెం రక్తం వచ్చింది, సహస్రారం ద్వారా ప్రాణం వదిలాడు. తన యొక్క మేథస్సుని, తన యొక్క బలాన్ని, తన యొక్క పలుకుబడిని, తన ప్రపంచ కీర్తిని అంతా మన భారతదేశం కోసం ఖర్చు పెట్టాడు, మన భారతమాత గర్భంలో జన్మించినటువంటి మహాత్ములలో వివేకానందుడు ఒకడు.

సోదరమహాశయులారా! మన దేశం యొక్క ఆర్థిక రంగంలో కానీ, రాజకీయ రంగంలో కానీ, సాంఘిక రంగంలో కానీ, అన్ని రంగాలలో వివేకానంద ప్రభావంలేని రంగం లేనేలేదు. ఈ రోజున మేము స్వాతంత్ర్యసమరంలో పాల్గొన్నామంటే ఆయన చెప్పినమాటలు అర్థం చేసుకొని ఆయన చెప్పినమాటలు జీర్ణం చేసుకొని, ఆయన చెప్పిన ఉపన్యాసాలు చదివి మేము స్వాతంత్ర్యసమరంలోకి వచ్చాము అని చెప్పిన నాయకులు మన భారతదేశంలో అనేకమంది ఉన్నారు. ఆయన లాస్ట్డేస్లో ఆర్గనైజేషన్ వర్క్ వదిలేసి, మఠంలో ఆరోజున పనిమనిషి రాకపోతే దూళ్ళపాక కూడా ఆయనే తుడిచేసేవాడు. పాక శుభ్రం చెయ్యాలంటే, ఆయన చేతితో ఆయనే శుభ్రం చేసేవాడు. ఆయన ఎటువంటి వాడంటే, ఒకసారి రామకృష్ణుడి పటం ఊరేగించి ఎక్కడో ప్రతిష్టించటం కోసం భజంత్రీలు పెట్టారు. భజంత్రీల వాళ్ళు రాలేదు. భజంత్రీలు కొట్టడం అందరికీ సిగ్గేస్తోందట. అప్పడు ఆయన ఇదేంటి మన గురువుగారి పటం ఊరేగిస్తున్నాము, ఆ భజంత్రీలు వాళ్ళు రాకపోతే సాయంత్రం వరకూ కూర్చుంటామా అని ఆ తాళాలు మెళ్ళో వేసుకొని ఆయనే జభంత్రీలు కొట్టి తీసు కొచ్చాడు. ప్రపంచ ప్రఖ్యాత వివేకానందుడు భజంత్రీలు కొట్టుకెళ్ళుతుంటే ఆ దృశ్యం మన కళ్ళతోటి

చూస్తే మనం నమ్మగలమా! ఈ రోజులలో మనకి కొంచెం గౌరవం వస్తేనే, చిన్న గౌరవం వస్తేనే, ఇదేంటి ఇంత చిన్న పని చేస్తున్నాను ఏం అనుకొంటారో అని మనకి భయం. మనకా ఆత్మ తెలిసేది?

ఎంతోమంది దారిద్ర్యంతో బాధపడుతుంటే మోక్షం గురించి గౌరవాల గురించి ఆలోచించటానికి నాకు టైం లేదు అన్నాడట. వాడు వివేకానందుడంటే! భారతదేశంలో దారిద్ర్యంతో ఇంతమంది బాధపడుతుంటే అక్షరాలు రాక నిరక్షరాస్యులై దేశమంతా ఇలా అలమటించిపోతుంటే మోక్షం గురించి ఆలోచించటానికి నాకు కాలం ఎక్కడ ఉందన్నాడు. చంటిపిల్లలు బాల్ ఆడుకుంటారు చూడండి, అలా ప్రపంచాన్నంతా కూడా ఆడుకోగల శక్తి గలవాడు వివేకానందుడు అన్నాడు రామకృష్ణ పరమహంస. అటువంటి శక్తి ఉంది ఆయనకి. నరసాపురంలో హైస్కూలులో హెడ్ మాష్టారు ఒకసారి మద్రాసులో వివేకానంద స్పీచ్ విన్నానని చెప్పారు. వివేకానంద ఏం చెపుతున్నాడో ముఖ్యం కాదు, ఆయన చెప్పింది విన్న తరువాత నేను ఇంటికి నడిచి వెళ్తుంటే భూమి మీద నడిచి వెళ్తున్నానా, గాలిలో ఎగిరి వెళ్తున్నానా అనిపించిందట. వినేవాళ్ళ మీద ఆయన మాటల యొక్క ప్రభావం అంత బలంగా ఉండేదట. తిరిగి ఇంటికి వెళ్ళిపోతుంటే మరో లోకంలో, మరో ప్రపంచంలో ఉన్నట్టు ఉండేదట. స్వయంగా ఆ హెడ్ మాష్టారు చెప్పిన మాట ఇది. రాజగోపాలాచారి బి.యల్. చదువుతున్నప్పుడు వాళ్ళ కాలేజీకి వివేకానంద వస్తే ఆయన కాలేజీలో రూమ్స్ తిప్పి చూపిస్తున్నాడట వివేకానందకి. ఒక రూములో కృష్ణుడి యొక్క పటం ఉందట. రాజగోపాలాచారి భుజం మీద చెయ్యి వేసి, కృష్ణుడి ఫొటో అలా నీలంగా ఎందుకు ఉంది నువ్వు చెప్పగలవా అన్నాడట. రాజగోపాలాచారి కూడా ప్రపంచ మేధావులలో ఒకడు. ఆకాశం నీలంగా ఉంటుంది. ఆకాశం అనంతమైనది. కృష్ణుడు కూడా అనంతమైన వాడు. అందుచేత ఆయన రంగు నీలంగా ఉంది అన్నాడట. రాజగోపాలాచారి రిప్లై విని ఈ భారతదేశంలో భవిష్యత్తులో నువ్వు ప్రముఖుడవు అవుతావు అని ఆశీర్వదించాడట వివేకానందుడు.

న్యూస్ పేపరులు వివేకానంద ఇంత గొప్పవాడు అంత గొప్పవాడు అని ఒకటే ఎడిటోరియల్స్ రాసేవి అట. మనమైతే ఎంతగొప్పగా రాస్తున్నాయి నాగురించి అనుకుంటాము. ఆయన గురించి గొప్పగా రాస్తున్న పేపరుల గురించి కూడా ఇది అంతా నాన్సెన్స్ అన్నాడు. అతను ఒకటే చెప్పాడు, నువ్వు సమాజం గురించి ఆలోచించు, భగవంతుడు సమాజరూపంలో ఉన్నాడు. సమాజానికి వేరుగా లేడు, నిన్ను నువ్వు మరిచిపోయి సమాజం కోసం నీ జీవితాన్ని అంతా ఖర్చు పెట్టు. సమాజం యొక్క సేవలో నువ్వు కరిగిపో, నువ్వు కర్తృత్వం లేకుండా అహంకారం లేకుండా పని చెయ్యి. పని చేసి ఫలితాన్ని ఈశ్వరుడికి విడిచిపెట్టేయి. ఫలితం ఈశ్వరుడు చూసుకుంటాడు, తరువాత నీ పని యొక్క ఫలితం జాతి అనుభవిస్తుంది, ప్రపంచం అనుభవిస్తుంది. నాకు మోక్షం వద్దు, నాకు సిద్ధి వద్దు, నాకు లిబరేషన్ వద్దు, ఒక మనిషే కాదు ఈ భారతదేశంలో పుట్టిన ఒక కుక్క ఆకలితోటి బాధపడుతుంటే దాని ఆకలి తీర్చటంకోసం నేను వెయ్యిసార్లు ఈ భారతభూమి మీద జన్మించటానికి సిద్ధంగా ఉన్నాను అన్నాడు. వాడు నరేంద్రుడు అంటే. ఫియర్, వాట్ ఫియర్, హూమ్ టు ఫియర్ అంటాడు. దేనికి భయపడతారు ఈ లోకంలో మీరు భయపడవలసింది

దేనికి? గో ఫార్వర్డ్, మార్చ్ ఫార్వర్డ్, లుక్ ఫార్వర్డ్, నో నీడ్ ఆఫ్ లుకింగ్ బిహైండ్. లుక్ ఎట్ ది ఓషన్ అండ్ నాట్ ఎట్ ది వేవ్స్. మీరు సముద్రాన్ని చూసినప్పుడు, సముద్రంలో నీటి వంక చూడండి, కెరటాల వంక చూడొద్దు. రాగద్వేషాలు కాదు ఇప్పుడు కావలసినవి, ఈ రాగద్వేషాలు పేరు ప్రఖ్యాతులు ఈ పెట్టీ మైడెండ్ పీపుల్‌తోటి మీరు స్నేహాలు చేయవద్దు. మీరు దేశానికి సేవ చెయ్యండి, మీరందరూ ఎంతవరకు చెయ్యగలరో అంతవరకు భారత భూమికి సేవ చెయ్యటంకోసం మీ జీవితాన్ని ఖర్చు పెట్టండి. మీరు స్వార్థాన్ని విడిచిపెట్టండి, స్వార్థాన్ని మరిచిపోయి మీరు పని చేస్తే మోక్షం దానంతట అదే వస్తుంది. మీ పాదాల దగ్గరకి వస్తుంది. వివేకానందుడు అంటే ఎవరు? అవసరమైతే తన మాంసాన్ని తన రక్తాన్ని తన ఎముకలని బజారులో పెట్టి అమ్మి ప్రజాసేవ చేద్దామనుకునే మహాత్ముడే వివేకానందుడు. తను సంపాదించిన రూపాయలనే కాదు, తన శరీరంలో ఉన్న ఎముకలని మాంసాన్ని రక్తాన్ని బజారులో పెట్టి అమ్మి తోటి మానవులకి ఉపయోగపడదాము అనుకునేవాడు వివేకానందుడు. భగవద్గీతలో ఆయన ఫేవరెట్ శ్లోకం క్షుద్రం హృదయ దౌర్బల్యం... అన్నిటికంటే నీచమైనది హృదయ దౌర్బల్యమే. హృదయంలో ఉన్న పిరికితనమే అన్నిటికంటే నీచమైనది. నువ్వు పొరపాటు చేస్తున్నావు అంటే భయం వల్ల చేస్తున్నావు. నువ్వు తప్పులు చేస్తున్నావు అంటే భయం వల్ల చేస్తున్నావు. అందుచేత నువ్వు భయపడకు. సమాజానికి ఏ చెడ్డ జరిగినా అది భయంలోంచే పుట్టుకు వస్తోంది కాబట్టి నువ్వు దేనికీ భయపడవలసిన పనిలేదు. ఎవరికి జడుస్తావు. నువ్వు ఎవరికీ జడవనక్కరలేదు, ఏదైతే నువ్వు మంచి అనుకొంటున్నావో, ఏదైతే నువ్వు త్రికరణశుద్ధిగా నమ్మావో, ఏ ఐడియల్ని అయితే నువ్వు పెట్టుకున్నావో ఆ ఐడియల్ కోసం నువ్వు జీవించు ఎదుటివాళ్ళు ఏమనుకొంటే నీకు లెక్క ఏమిటయ్యా? ఆకాశాన్ని చూసి కుక్కలు మొరుగుతాయి. నీకేంటి అన్నాడు.

నిన్ను ఎవరైనా విమర్శిస్తూ ఉంటే నిన్ను ఎవరైనా తిడుతుంటే, వాళ్ళ గురించి నువ్వు ఏమనుకుంటావు అని ఒకసారి రామకృష్ణుడు అడిగితే, నన్ను తిట్టేవాళ్ళందరూ కుక్కలు అనుకుంటాను అన్నాడట వివేకానంద. అంత పెద్ద మాటలు అనకూడదు, ఎందుచేతనంటే అంత పెద్ద మాటలు అంటే ఒకోసారి నీకు తెలియకుండా అహంకారం రావచ్చు. అందుచేత అంత పెద్ద మాటలు అనకు. వాళ్ళ మాటలు లక్ష్యం చెయ్యకు, నీ దారిన నువ్వు ప్రయాణం చెయ్యి. కుక్కలని నక్కలని అంత పెద్ద మాటలు అనవద్దు అన్నాడు రామకృష్ణుడు. అంటే బ్రేకులు వేస్తున్నాడు, భవిష్యత్తులో గొప్ప టీచర్ అవ్వబోతున్నాడు కదా! అందుచేత ట్రైనింగ్ ఇస్తున్నాడు. ఎక్స్‌ప్రెషన్ ఎలా ఉండాలో, ఆ ఎక్స్‌ప్రెషన్ బ్యూటీస్ ఎలా ఉండాలో రామకృష్ణుడు ఎంతో ట్రైనింగ్ ఇచ్చి విడిచిపెడుతున్నాడు.

నా మతం ఏమిటంటే, నా మతం బలమే, నా మతం హిందూమతం కాదిక్కడ. నా మతం బలం. ప్రతీ మనిషి బలంగా ఉండాలి, మన జాతి బలంగా ఉండాలి. మన సమాజం బలంగా ఉండాలి, ది ఎసెన్స్ ఆఫ్ రిలీజియన్ ఈజ్ స్ట్రెంగ్త్ అన్నాడు స్వామీజి. నామతం యొక్క సారం ఏమిటంటే బలమే. బలం లేనివాడికి ట్రూత్ ఏమి తెలుస్తుంది అన్నాడు. శారీరకంగా మానసికంగా నువ్వు కనుక బలవంతుడివి కాకపోతే, నువ్వు ఆరోగ్యవంతుడివి కాకపోతే, నీకు సత్యం ఎలా తెలుస్తుంది అన్నాడు. నీకు మంచి అని తోచింది, మీరు మంచి అని

నమ్మింది ఎదుటివాళ్ళు ఏమనుకుంటారు అని అనుమానం పెట్టుకోకుండా మీరు భయపడకుండా ఏమి సంకోచం లేకుండా దేశంలో ప్రజలు అందరూ మీకు ఎదురు తిరిగినా సరే అది చెయ్యండి. నువ్వు ఎంత మంచి పని చేస్తున్నా నిన్ను విమర్శించేవాళ్ళు ఉంటారు అన్నాడు వివేకానందుడు. కారు వెనకాల దుమ్ము ఎలా లేస్తుందో, నువ్వు ఎంత మంచి పని చేసినా సరే నిన్ను విమర్శించేవాళ్ళు ఎప్పడూ ఈలోకంలో ఉంటూనే ఉంటారు. లోకం కుక్కతోక వంటిది అన్నాడు. నువ్వు పాపివి కాదు నిన్ను పాపి అనేవాడు పాపి అన్నాడు వివేకానందుడు. నువ్వు పాపం చేసావు, నువ్వు పాపివి, అని నిన్ను కిందికి తొక్కేస్తున్నారు. నువ్వు పాపివి కాదు, నువ్వు అమృత పుత్రుడవు, నువ్వు ఆత్మ పుత్రుడవు, నువ్వు భగవంతుడి పుత్రుడవు. అయితే నువ్వు ఆత్మని తెలుసుకోవటానికి ఇక్కడ జన్మించావు. నువ్వు పాపివి కాదు, నిన్ను ఎవడైతే పాపి పాపి అంటున్నాడో వాడు పాపి. ఆత్మకు పాపం ఏమిటి అన్నాడు. నా డిక్షనరీలో సిన్ అనేది లేదు అన్నాడు, నా డిక్షనరీలో ఫియర్‌కి స్థానం లేదు అన్నాడు.

వివేకానందస్వామి యొక్క ఋణం మనము తీర్చుకోలేము. ఆయన గ్రేట్ ఆరేటర్, గ్రేట్ రైటర్, గ్రేట్ టీచర్, గ్రేట్ సోషల్ రిఫార్మర్, గ్రేట్ పేట్రియాట్, గ్రేట్ సెయింట్. ఒకటన్నమాట ఏంటి, అన్ని గుణాలు ఒకచోట మీట్ అయ్యాయి. అమెరికాలో ఒకచోట మాట్లాడుతుంటే, ఏమిటి మీ రామకృష్ణుడి గురించి చెపుతున్నావు, వాడికి అక్షరాలు కూడా రావు. వాడికి సంతకం పెట్టటం చేతకాదు, వాడు చాలా గొప్పవాడు అంటున్నావు. వాడు టీచర్ అంటున్నావు, ఆ రామకృష్ణుడు ఎవడు? ఆ రామకృష్ణుడి యొక్క వైభవం, ఆయన సందేశం నువ్వు చెపుతున్నావు కాబట్టి తెలుస్తోంది, నువ్వు కదా రామకృష్ణుడి సందేశాన్ని ప్రపంచమంతా వ్యాప్తి చేస్తున్నావు. హు ఈజ్ రామకృష్ణ పరమహంస అన్నాడు ఒకడు. అప్పడు వివేకానందుడు అన్నాడు, ఎవరు అనుకొంటున్నావు నువ్వు రామకృష్ణుడు అంటే నువ్వు ఎవడైతే గొప్పవాడు అనుకొంటున్నావో, ఇటువంటి వివేకానందులని ఒక్క స్మరణ మాత్రముచేత, ఒక తలంపు మాత్రముచేత వెయ్యిమంది వివేకానందులని ఈలోకంలో పుట్టేలాగా చెయ్యగలడు, వాడు రామకృష్ణుడు అంటే అన్నాడు. వాడికి గురువుపట్ల అనుబంధం చూడండి.

అరైజ్, అవేక్ అండ్ స్టాప్ నాట్ టిల్ ది గోల్ ఈజ్ రీచ్డ్. ఎంతకాలం అలా నిద్రపోతావు, ఎన్ని జన్మలు అలా నిద్రపోతావు, ఎన్ని జన్మలు అజ్ఞానంలో ఉంటావు. ఒకసారి నిద్రనుంచి బయటకు లే, నడవడం ప్రారంభించు. భగవంతుడే నీ గమ్యం, భగవంతుడిని చేరే వరకు నీ నియరెస్ట్, డియరెస్ట్, ఎవరు నిన్ను పిలిచినా, ఎవరు నిన్ను కేక పెట్టినా, భగవంతుడు అనే గమ్యానికి ప్రయాణం ప్రారంభించినప్పడు నువ్వు ముందుకి సాగిపో అన్నాడు స్వామి వివేకానంద. నువ్వు భగవంతుడిని తెలుసుకునే ప్రయాణంలో ఆ సాధనలో ఉన్నప్పడు నీవాళ్ళు నిన్ను వెనక్కి పిలుస్తున్నప్పటికీ, నీ వాసనలు వెనక్కి లాగుతున్నప్పటికీ, నీ కోరికలు నిన్ను అడ్డగిస్తున్నప్పటికీ నీ గమ్యం మర్చిపోకు. నీ గమ్యం చేరేవరకూ నువ్వు ప్రయాణం ఆపు చెయ్యకు. నీ గమ్యం చేరేవరకు నువ్వు ఆగకు. ఎంతకాలం అలా నిద్రపోతావు. ఎన్ని జన్మలు అలా తిరుగుతావు. ఎన్ని దేహాలను మోస్తావు. ఎన్ని శవాలను మోస్తావు. ఎన్ని లోకాలు తిరుగుతావు మనసా! నీ స్వస్థానము భగవంతుడే. ఓ మనసా నీ స్వస్థానమునకు పొమ్ము అన్నాడు స్వామి వివేకానంద.

## శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

| | |
|---|---|
| సెప్టెంబర్ 20 | మధ్యాహ్నం గం॥ 2-00ల నుండి హైదరాబాద్ రాజేశ్వరి గారి ప్రవచనం |
| సెప్టెంబర్ 23 | **సద్గురు శ్రీనాన్నగారి జయంతి ఉత్సవములు** |
| | ఉదయం గం॥ **6-00**ల నుండి **పారాయణ** |
| | ఉదయం గం॥ **7-00**ల నుండి **ప్రసాద వితరణ** |
| | ఉదయం గం॥ **8-00**ల నుండి **పూజ** |
| | ఉదయం గం॥ **9-00**ల నుండి **భక్తుల ప్రవచనములు** |
| | ఉదయం గం॥ **11-00**ల నుండి **అన్నప్రసాదం** |
| | మధ్యాహ్నం గం॥ **1-00**ల నుండి **డా॥ ఉషగారి ప్రవచనం** |
| అక్టోబర్ 2 | గాంధీ జయంతి సందర్భంగా మధ్యాహ్నం గం॥ 2-00లకు అమలాపురం మాష్టారు గారిచే ప్రవచనం |

## సద్గురు శ్రీ నాన్నగారు

అహంకారమును కేంద్రముగా పెట్టుకొని దుఃఖము, అశాంతితో మనుగడ సాగించే, మానవాళిని తరింపజేయడానికి, మహాత్ములు గురురూపంలో ఈ భూమిపై అవతరిస్తూనే ఉన్నారు. అట్టి కోవకు చెందినవారే భగవాన్ శ్రీ రమణమహర్షిచే ఎన్నుకోబడిన సద్గురువు శ్రీ నాన్నగారు. దేహధారిగా మనమధ్య 83 సంవత్సరాలు సంచరించి, ది. 29-12-2017న శివైక్యం చెందారు. భక్తకోటిచే ప్రియముగా 'నాన్నగారు' అని పిలువబడి, అతి సామాన్యునివలె జీవించి, భగవాన్ శ్రీరమణుల తత్త్వవైభవానికి కొనసాగింపుగా జ్ఞానబోధ చేసి, మూర్తీభవించిన కరుణ, నమ్రతతో మనకు ఆదర్శప్రాయులైనారు. తాను జీవించియున్నకాలంలో భగవాన్ శ్రీరమణుని పట్ల తన విశ్వాసమే ఊపిరిగా వ్యవహరించి, శ్రీరమణ బోధామృతాన్ని సమకాలీన సమాజానికి అందించి, తన అమృత వాక్కులతో ఎందరినో సత్యాన్వేషణకు పురిగొలిపి, అతిక్లిష్టమైన ఆధ్యాత్మిక సత్యాలకు స్వానుభవాన్ని జోడించి సూటిగా, సరళంగా సామాన్యులకు సహితం అర్థమయ్యే రీతిలో ఎరుకపరిచిన మేటి బోధకుడు శ్రీనాన్నగారు. ఆయన జీవితంలో ప్రతి కదలిక, ప్రతి సంఘటనలోనూ, నేపథ్య సంగీతంలా శ్రీరమణ తత్త్వమే ప్రతిధ్వనించేది. అతి సామాన్యమైన వాడుక పదాలతో తత్త్వసారాన్ని అందించిన 'రమణభాస్కర' మాస పత్రిక సాధకులకు వరప్రసాదముగా నిలిచింది. ఆయన జీవితంలోని చరమదశలో కూడా ఎంతో ప్రయాసకోర్చి, తత్త్వప్రధానమైన అంశాలను బోధించుటకే ఎక్కువ ప్రాధాన్యత నిచ్చేడివారు. ఈ మానవ జన్మ గొప్ప బహుమతిగా ప్రసాదింపబడినందుకు, సద్గురువు లభించినందుకు, మనము ఎంతో కృతజ్ఞత కలిగి యుండి, గురుబోధను నిత్య జీవితానికి అన్వయం చేసుకుంటూ, తద్వారా ఈ జీవితాన్ని అమృతమయం చేసుకోవాలి. గురుస్వరూపము బుద్ధికి సాక్షియైన అనుగ్రహ స్వరూపమే! జ్ఞాన దానం చేసే గురువుకు మనము ఎంతో ఋణపడి ఉంటాం! గురువంటే ఒక వ్యక్తికాదు, గురువంటే ఆత్మ కాబట్టి, సాధకులమైన మనము విశ్వాసముతోనూ, ప్రేమతోనూ, గురుబోధను ఆచరించి, గురు ఋణము తీర్చుకుందాం!

**(ది॥ 23-09-2018 సద్గురు శ్రీ నాన్నగారి జయంతి సందర్భంగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

**SRI RAMANA KSHETRAM** A/c. No. **510101006497273**
CORPORATION BANK, PALAKOL Branch
IFSC Code : **CORP0001613**

**ఆంధ్ర ఆశ్రమము, తిరువణ్ణామలై ఫోన్ : 04175-236174**
**For Accomodation : 9849124502, 7780639977**

**మీ 'రమణ భాస్కర' చందా గడువు ఆగష్టు నెలతో ముగుస్తున్నది. కావున రెన్యువల్ చందాను స్వయముగాగానీ, యంఓ ద్వారా గానీ కట్టవచ్చును. యంఓ చేయదలచిన వారు శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - 534 265 పేరున రు. 150/-లు పంపగలరు.**

# భగవంతుని దయే గురువుగా రూపుదాల్చుతుంది

అతి సున్నితమైన మనస్సు గల సాధకులు మాత్రమే ఋషిని గుర్తించగలరు. ఆ సద్గురు ఆశ్రయిస్తే తప్ప ఆధ్యాత్మిక చరమ స్థితికి వెళ్లడం దాదాపు అసాధ్యం. సాధకునకు ప్రతిబంధకాలు కొన్నికోట్లు ఉంటాయి. అసత్యదారులు అగాధాలు కోకొల్లలు అవి తెరుచుకొని మరులుగొల్పి మభ్యపెడుతూ మనలను ఆహ్వానిస్తాయి. దానితో దారి తప్పిపోవటం ఎంతో సులువు. దారి బాగా తెలిసిన సద్గురుబాటలో నడిస్తే గమ్యాన్ని చేరుతాము. గురువును సంపూర్ణంగా విశ్వసించి శరణుజొచ్చడం ఆయన చెయ్యి వదలకుండా నడవాలి. వేయి గ్రంథాలు ఇచ్చే జ్ఞానంకన్నా గురువు అనుగ్రహంతో లభించే అనుభవజ్ఞానం గొప్పది. పుస్తకాలు చదువు మనస్సుకు వంటబడుతుంది తప్ప హృదయానికి చేరదు. గురువు హృదయంలో ప్రవేశించి జ్ఞాన జ్యోతిని వెలిగించగలడు. గురు సన్నిధిలో గడపటమే తపస్సు. ఆయన సన్నిధిలో కళ్ళు మూసుకొంటే చాలు పరమశాంతి లభిస్తుంది. మౌన భాషే యోగ భాష. మన భావాలను గురువు చదవగలరు, సమాధానాలు మౌనంగా అందించగలరు. సునిసితబుద్ధికి అది అందుతుంది. గతాన్ని సమాధిచేస్తే భవిష్యత్తు ఉంటుంది. గురువును పరమాత్మగా గుర్తించి మనస్సులో ఆరాధించటమే శిష్యత్వము. చైతన్యాన్ని పుణికిపుచ్చుకోవటమే శిష్యుని ధ్యాస, కర్తవ్యం. అప్పుడు మన బాధలనుంచి విముక్తి చెయ్యటం గురువు కర్తవ్యంగా భావిస్తాడు. మన బాధ్యత శరణాగతి పొందటం, భక్తి, గౌరవం ఈ మూడు పదాలను అన్వయించుకొంటే చాలు. పై అర్హతలు ఉన్న వారే శిష్యులు. గురు శిష్యుల మధ్య ప్రేమ, అనురాగం అనేది పాతాళాన్ని చేదించుకొనే గంగలా ఉండాలి. గురువు విషయంలో అది ఆకాశగంగ. అది శిష్యునికి ఆధ్యాత్మిక దప్పిక తీరుతుంది, శాంతిని పొందుతాడు. గురు ప్రసాదం వల్ల సుఖ దుఃఖాలను సమానంగా చూచేవాడికి మృత్యు భయం లేదు. ఆ ప్రసాదం దక్కనివాడు సంసారంలోకి వస్తూ పోతూ ఉంటాడు. మన అహంకారాన్ని గతాన్ని శిలువ వేసి చంపాలి. అప్పుడు ఆనందం, సౌందర్యం ఉంటుంది. అలా చెయ్యకపోతే గురువుకు స్థలమే ఉండదు. మనం ఎంత శాంతంగా ఉంటామో గురువుకు మనం అంత అందుబాటులో ఉంటాము. గురువు మహిమ వల్ల సంసార సాగరంలో దిక్కు తోచక కొట్టుమిట్టాడేవారికి తీరానికి చేరి సుఖిస్తాడు. బ్రతికి ఉన్న గురువు చేతిని పట్టుకోలేనప్పుడు ఎన్నో సంవత్సరాల నాటి గురువును మనం ఎలా పట్టుకోగలం? అనుమానాలు వస్తాయి. కానీ మనం పట్టుకొన్న గురు శరీరం వాడినా అనుగ్రహం వరదలా వస్తుంది సందేహం లేదు. ప్రేమించేది శరీరం కాదు ఆత్మ. పుట్టు గుడ్డివాడు సూర్యుని చూడనట్లే పాప కర్మలతో కళంకితమైన వాడు గురు మహిమను గ్రహించలేడు. సాధన ఎలా ఉండాలి అంటే గురువు ఎడల తన్మయత, ఆత్మార్పణం ద్వారా సాధించలేనిది ఏమీ లేదు. కర్మ, జ్ఞాన, భక్తి, యోగములందు అవిభాజ్యమైన సంబంధం కలుగుతుంది. ఒక యోగము మరియొక పరస్పర ఆధారము అనుకూలమైన సహకరించుకుంటూ అన్నీ ఏకోన్ముఖమైనప్పుడే మనకు బ్రహ్మజ్ఞానం కలుగుతుంది.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**